



"సారధి ఇంట్లో లేడా?"

తలుపు దగ్గరే నిలబడి అడిగాడు రాజారావు.

"లోపలకు రండి. అక్కడే నిలబడిపోయారేం?"

డ్రాయింగ్ రూమ్‌లో "ట్యూబ్ లైట్" వెలిగించింది సులోచన.

లోనికివచ్చి టీపాయ్‌మీద పేపరు చేతిలోకి తీసుకున్నాడు రాజారావు.

సులోచన ఇంట్లోకివెళ్ళి రెండుక్షణాల్లో మంచినీళ్ళగ్లాసుతో తిరిగి వచ్చింది.

"మంచినీళ్ళు తీసుకోండి!"

అతడు నీళ్ళు తాగుతూవుంటే అంది "ఆయనలేరు"

"ఎక్కడికి కెళ్ళాడు?"

"సాయంకాలం వాళ్ళ సేల్సు మేనేజర్ వచ్చారు. విజయనగరంలో ఏదో "అర్జెంట్" పనివుందని ఇద్దరూ కలిసివెళ్ళారు." రెండు క్షణాలు ఆగి అంది...."రేపు వుదయంకాని రారు!"

"నే వెళతాను!" రాజారావ్ లేచాడు.

"మొ తానికి మొగాళ్ళనిపించుకున్నారు" సులోచన నవ్వుతూఅంది. "ఆయన లేకపోతే కూర్చోకూడదా?"

"ఎందుకుకూడదూ....?" నీళ్ళు నములేడు.

"అయితే, ఇంకా నిలబడే వున్నారేం?"

తడబాటును కప్పిపుచ్చుకుంటూ రాజారావ్ కూడా నవ్వేశాడు.

"పనేంలేదు, తోచక ఇటువచ్చేను. సారధి వుంటే "సెకండ్ షో" సినిమాకు వెళదామనుకున్నాను"

"ఏమీ తోచక వచ్చేరు. ఆయన లేరంటే వెళ్ళిపోతున్నారు. నాతో కబుర్లు చెప్పరాదా? ఆయన వెళ్ళినప్పటినుంచీ నాకూ ఏమీ తోచకుండా వుంది. మీ "రిప్రజింటేటివ్"లకు ఊళ్ళు పట్టి తిరగడం తప్ప భార్యలు ఏమైపోతారన్న బాధే వుండదు."

రాజారావ్ సులోచనవైపు చూశాడు.

ఆమె కళ్ళు కొంటెగా నవ్వుతున్నాయి! అందమైన పెదాలు తడిగా కదులుతున్నాయి.

"సులోచన ఉద్దేశ్యం ఏమిటి?" రాజారావుకి ఈ పరిస్థితి కొంత ఇబ్బంది కలిస్తోంది—

"మాట్లాడరేం?"

"అబ్బే ఏంలేదు! మా గురించి అంతా మీరే చెప్పేస్తున్నారు!" అన్నాడు.

అతనికి అంతకంటే ఏం మాట్లాడాలో తోచలేదు

"కాఫీ కలిపి తీసుకువస్తాను. కూర్చోండి!"

"ఇప్పుడేం వద్దండీ! రాత్రి తొమ్మిది గంటలవేళ కాఫీ ఏమిటి?" అనాలనుకున్నాడు. కాని మాటలు ప్రారంభించే వేళకు సులోచన గదిలో లేదు. గిరుక్కున తిరిగి లోనికి వెళ్ళిపోయింది. జడలోని మల్లెచెండు ఆ విసురుకు రాజారావు పాదాలచెంత పడింది. మెల్లగా వంగి మల్లెచెండుతీసి టీపాయ్‌మీద వుంచాడు.

మల్లెమొగ్గలు అలవోకగా విడి నవ్వుతూ కవ్విస్తున్నాయి!

"ఈ ఆల్బమ్ చూస్తూ వుండండి. ఎప్పటినుంచో విడిగా పడేసిన ఫోటోలన్నీ ఈ దినమే కూర్చుని కష్టపడి అతికించేను. మీరు ఫొటోలు చూసేలోగా కాఫీతెస్తాను" సులోచన ఆల్బమ్ అతని ముందుంచింది.

"మీరు అనవసరంగా శ్రమ తీసుకుంటున్నారు!" రాజారావు మొహమాటంగా అన్నాడు.

"శ్రమ దేనికి?"

"కాఫీ తయారుచేయడానికి!"

"శ్రమ తీసుకునే కాఫీ కలపను! కప్పుడు పాలతో అరక్షణంలో తయారయ్యే కాఫీ కలుపుతాను. కాఫీలో కొత్త విప్లవం! ఫొటోలుచూడండి ఇపుడే వస్తాను!" కుర్చీపక్కనున్న "టేబిల్ లేంపు" వెలిగించి ఇంట్లోకి వెళ్ళిపోయింది సులోచన.

ఆమె తనయెడల పూర్వంకంటె ఎక్కువ చనువు తీసుకుంటున్నట్లు అన్పించింది రాజారావుకి.

తనకూ, సారథికీ పరిచయమై సుమారు ఆరునెలలయింది. తనలాగే అతడుకూడా "రిప్రజెంటేటివ్"గా పనిచేస్తున్నాడు. ఇద్దరూ కలసి తరచు ఓకేవూళ్ళు తిరగడంవలన ఇద్దరికీ పరిచయం వృద్ధి అయింది. సారథిలోని మంచితనం, అమాయకత్వం రాజారావును బాగా ఆకర్షించేయి. ఆరునెలల్లోనే ఇద్దరిమధ్యా స్నేహం బాగా బలపడింది. రాజారావు ఇంతకుపూర్వం సులోచనతో అయిదుసార్లు మాట్లాడేడు. అయితే ప్రతిసారీ సారథి సమక్షంలోనే! సులోచనలో ఎక్కువ చొరవ తీసుకుని మాట్లాడే తత్వం వుందని తెలుసు. కాని ఈ దినం పరిస్థితి వింతగా వుంది.

ఆలోచిస్తూ ఆల్బమ్ తిరగేస్తున్నాడు రాజారావు.

మొదటి పేజీలో సులోచన, సారథిల పెళ్ళిఫోటో। క్రిందవివాహం తేదీ। పెళ్ళిజరిగి సుమారు మూడేళ్ళవుతోంది.తమాషా ఏమిటంటే తనకూ విజయకూ అదే తేదీన వివాహమయింది!

తరువాత పేజీల్లో ఫోటోలన్నీ సులోచనవే। ఆమె ఫోటోలు చూస్తూ దృష్టి మరలించుకోలేకపోయాడు. ముఖ్యంగా ఆకర్షించినది ఆఖరు పేజీలోని ఫోటో! టేబిల్ మీద రెండుచేతులూ ఆన్చి, విరిసిన కలువ రేకుల్లాంటి వేళ్ళమధ్య ముఖం పెట్టుకొని కనుపాపలు పై పైపుకి ఎత్తి చూస్తూ నవ్వులు చిందిస్తున్న సులోచన। చక్కని క్లోజప్। ముఖంలోని నిజమైన భావాలను, పెదాలపై చలించే నవ్వునూ కెమేరా ముద్రించలేదంటారు కొందరు। అయితే ఈఫొటో చూసేక అన్పించింది రాజారావుకు—

"కెమేరాను వాడుకునే రీతిలో వాడుకోవాలేగాని అది చేయలేని పనిలేదని!" గుండ్రని ముఖం, అందమైన పెదాలు, ఆకర్షణీయమైన కనులు; చూస్తూ ఫొటోవైపునుండి దృష్టి మరల్చుకోలేకపోయాడు.

"అంత అందంగా వున్నానా?"

తుళ్ళిపడ్డాడు రాజారావు.

ఎదురుగా సులోచన। కాఫీ కప్పులతో నిలబడివుంది।

"అహ్।—ఫొటో।...."

"ఫోటో అందంగా వుంది! నేను అందంగా లేను। అంతేనా?" కాఫీ అందించింది నవ్వుతూ. కప్పు అందుకుంటుంటే ఆమె చేతివేళ్ళు తగిలాయి।

కాదు। తగిలించినట్లు స్పష్టమయింది. రాజారావుకు।

ఫోటోలోని అందమయిన ముఖాన్ని పొదివి పట్టుకున్న వేళ్ళు జ్ఞప్తికి వచ్చేయి। పేడిగా పదునుగా వున్నాయి ఆమె వేళ్ళు।

కాఫీ గటగటా త్రాగి కప్పు టీపాయ్‌మీద వుంచేడు.

"కాఫీ వేడిగా లేకపోతే చెప్పటానికికూడా మొహమాటం అన్న మాట!"

"వేడి సరిపోలేదని ఎవరు చెప్పారు!" రాజారావు అన్నాడు.

"కాఫీని మంచినీళ్ళలా తాగేసి, వేడి సరిపోయిందంటే ఎవరు నమ్ముతారు?"

"నేను ఎక్కువ వేడి తాగను!"

"ఎదుటివాళ్ళమీద అభిమానం ఎక్కువయితే ఈ రకమైన సర్దుబాటు చేసుకోవడం అలవాటవుతుంది లేదా చెప్పటానికి మొహమాట పడివుండాలి!" సులోచన చిరునవ్వుతో అంది.

"నాకు మొహమాటం లేదు!"

"అయితే ఇదంతా నామీద అభిమానమే నన్నమాట!" కొంటెగా నవ్వుతోంది సులోచన.

రాజారావు మవునంగా వుండిపోయాడు.

"ఏం మాట్లాడరేం?"

"మీరు నన్ను ఇబ్బందిలో పెట్టేస్తున్నారు...." కాస్త ముక్తసరిగా ఎటో చూస్తూ అన్నాడు.

"క్షమించండి...." నొచ్చుకున్నట్లుగా అంది.

"ఫర్వాలేదు!"

"వక్కపొడి తీసుకోండి!" డబ్బా అందుకోబోయాడు రాజారావు.

అంతలోనే ఆమె డబ్బా వంపి చేతిలో వేసుకొని రాజారావు ముందుంచింది.

అతడు మునివేళ్ళతో ఆమె అరచేతిలోని వక్క పలుకును అందుకునేటంతలో తమాషాగా వేళ్ళను దగ్గరకు ముడిచేసింది. ఆమె వేళ్ళు నిప్పు కణికల్లా కాలిపోతున్నాయి.

రాజారావును ఈ పరిస్థితి ఎంతగానో కలవరపెడుతోంది!

తనకు తెలియకుండానే ఈ పరిస్థితి యెడల మనసు కొంత ఇష్టాన్ని కూడా ప్రకటిస్తున్నట్లు అనిపించింది.

సుతారంగా వక్క పలుకును అందుకొని నోట్లో వేసుకుంటూ సులోచనవైపు చూశాడు. ఆమె కళ్ళు కొంటెగా చూస్తున్నాయి.

మూసుకున్న పెదాల మధ్యనుండి బయట పడటానికి గింజు కుంటున్న చిరునవ్వు!

"మీకు శాస్త్రీయ సంగీతమంటే ఇష్టమేనా!" అంది రెండు క్షణాలు ఆగి!

"చాలా ఇష్టం!" అన్నాడు.

"నాకంటేనా?...." ప్రశ్నించి తనవైపు చూస్తోంది.

రెండు క్షణాలు ఇద్దరి చూపులూ కలిశాయి.

"....నాకంటే మీకు ఎక్కువ ఇష్టంకాదని చెప్పగలను! నాకు శాస్త్రీయం వింటూవుంటే తిండీ, నిద్రా ఏమీ అక్కరలేదు. బాలమురళీకృష్ణ అంటే నాకు ప్రాణం! అఫ్‌కోర్స్!....అతని గానం...."

"సులోచన చాలా తెలివిగా మాట్లాడగలదు" అనుకున్నాడు రాజా రావు.

"రండి! గదిలోకి వెళదాం! ఈ దినమే బాలమురళి ఎల్. పి. కొన్నాను."

"స్టీరియో" మీద "ప్లే" చేస్తాను" అంటూ సులోచన లేచింది. రాజారావు మంత్రముగ్ధునిలా లేచి నిలబడి ఆమెను అనుసరించాడు. వాళ్ళ పడకగదిలోకి రావడం అదే మొదటిసారి అతనికి! గది మల్లెపూవులా వుంది! గోడలకు ఒకటి రెండు ప్రకృతి దృశ్యాలు తప్ప మరింకేమీలేవు! గదిలో ఒకవారగా స్టీరియో వుంది! స్పీకర్లు రెండూ గదికి చెరొకమూలా వున్నాయి! గది మధ్యగా డబుల్‌కాట్! పైన సీలింగ్ ఫేన్!

"మా బెడ్‌రూంలో కుర్చీలులేవు! అలా మంచంమీద కూర్చోండి" సులోచన వెళ్ళి రికార్డువుంచి స్టీరియో "ఆన్" చేసింది!

మంద్రంగా సంగీతం గదిలో అలుముకొంది.

"మీ బాలమురళి ఇంగ్లీషు పాటలు కూడా పాడేరా?" స్పీకర్‌లోంచి వినిపిస్తున్న ఇంగ్లీషు పాటవిని నవ్వుతూ అడిగేడు రాజారావు.

"మీరు భలే జోక్ చేస్తారే! ఇది బాలమురళిదికాదు. "ఎల్విస్" రికార్డు. ఇది విన్నాక అది ప్లేచేద్దాం!"

"మీ ఇష్టం! మీరు ఏది వినిపిస్తే అది వింటాను"

"ఏంచెప్తే అది చెయ్యరా?" గోముగా అడిగింది సులోచన.

రాజారావుకి ఆమె ఆంతర్యం పూర్తిగా అర్ధమవుతోంది!

ఇక ఏవిధమైన సందేహాలకు తావులేదు! అతనిలోని అహం, మొగతనం క్షణంసేపు బయటికివచ్చి నిలబడ్డాయి!

సులోచన అందం అతన్ని వశపరచుకున్నట్లనిపించింది. కాని అంతలోనే భార్య అందమయిన ముఖం అతని కనుల ఎదుట కదిలింది. విజయకు తాను ద్రోహం చేయలేడు.

తలయెత్తి ఎదురుగా చూశాడు. స్టీరియో అవతల "ఫోటోఫ్రేం"లో బిగించిన సారధి ఫొటో తనవంకే చూస్తున్నట్లనిపించింది.

"ఉహూ! లాభంలేదు! తనీ పాపం చేయలేడు. నమ్మకద్రోహం తన చేతకానిపని!" సులోచన ఆకర్షణలో మునిగిపోకముందే తను తేరుకోవాలి! ఆమె అతని దగ్గరకు వచ్చింది.

"ఎల్విస్" పాట తారాస్థాయి చేరుకొంది.

ఆమె మెత్తని చీరకుచ్చెళ్ళు అతని పాదాలను తాకుతున్నాయి.

ముఖంలో ఏభావం వ్యక్తం చేయకుండా సులోచనవైపు చూశాడు.

సడిచేయకుండా నిశ్శబ్దంగా పెదాలు కదిల్చి ప్రవహింపచేస్తున్న సులోచన నవ్వు అతన్ని మహత్తరంగా కదిపేస్తోంది!

రెండుచేతుల వేళ్ళూ అతని జుత్తులోనికి పోనిచ్చి "రాజా!" అంటూ స్పష్టంగా గొణిగింది. క్షణంసేపు ఆమె తీయని ఊపిరి, వేడి స్పర్శ అతన్ని విపరీతంగా కలవరబెట్టేయి.

సారథి "ఫ్రేం" లోంచి తనవైపే చూస్తున్నట్లనిపించింది.

విజయ అందమయిన ముఖం కనుల ఎదుట కదిలింది!

అంతే! శక్తినంతటినీ కూడగట్టుకొని సులోచనను వెనక్కి నెట్టి లేచి నిలబడ్డాడు. సులోచన తూలి పడబోయి నిలదొక్కుకుంది.

"సులోచనా! నాకీపని ఇష్టంలేదు!" నిలబడిన సులోచన రొప్పుతోంది. ఆకలిగొన్న ఆడపులిలా ఆమె కళ్ళు ఎర్రబడి వున్నాయి. ఆమె అధరాలు కోపంతో వణికిపోతున్నాయి. బుగ్గలు కందిపోయి అరుణిమ దాల్చేయి.

సులోచనవంక తేరిపార చూడటానికి కూడా భయం వేసింది అతనికి. గాభరాగా అడుగులు వేసుకుంటూ గదిలోంచి బయటకు వచ్చాడు.

రోడ్డు ఎక్కి ఇంటివైపు నడక ప్రారంభించాడు.

రాజారావుకు తనేదో వింత మనిషిగా మారిపోయిన అనుభూతి కలుగుతోంది. నుదుట పట్టిన చెమటను రుమాలుతో అద్దుకున్నాడు. సులోచన తనపై కోరిక పెంచుకుంది. తనను ఆమెలోకి ఆహ్వానించింది. ఈ చర్యలకు తన బాధ్యత ఎంతవరకూ ఉంది?

ప్రత్యక్షంగాగాని, పరోక్షంగా గాని తానెప్పుడూ సులోచనపై అటువంటి భావం ప్రకటించలేదు. ప్రకటించడమేకాదు, అసలు తనకా భావమే రాలేదు ఇంతకుముందు! సులోచనను మిత్రుని భార్యగానే చూశాడు. కాని ఊహల్లోనయినా తనకు దురుద్దేశంలేదు. అయితే ఈ దినం ఫొటోఆల్బం తిరగేస్తుంటే అందమయిన ఆమె కనులను, పెదాలను చూసి చలించిన మాట వాస్తవం! కాని సులోచన కల్పించిన పరిస్థితులే అందుకు కారణం. సులోచన ప్రతి చర్యలోను తనను ఆకర్షించడానికి యత్నాలు చేసింది. ప్రతి మాటలోనూ తనను కవ్వించింది!

అంతటి అనుభవాన్ని తప్పించుకోవటం ఎంత అసాధం?

"తనకి పూర్తి అయిష్టత ఉంటే, డ్రాయింగ్‌రూంలోంచే తప్పించుకొని బయటపడి ఉండేవాడు. కాని బెడ్‌రూంలోకి ఎందుకు వెళ్ళినట్లు?"

మొదటే పరిస్థితి విషమించకుండా చూసుకొని ఉంటే ఇంత విప రీతంగా తయారయి వుండేదికాదు.

తనదీ కొంత పొరపాటు వుంది.

ఈనాడు ఈ సంఘటన జరిగిపోయివుంటే—తను ఆజన్మాంతం విజయ దగ్గర దోషిలా తలవంచుకోవలసి వచ్చేది. ఈ నిజం ఆమెకు తెలియకపోయినా, తన అంతరాంతరాలను తొల్చకమానదు!

విజయను తను గాఢంగా ప్రేమిస్తున్నాడు!

విజయ కూడా తనను ప్రాణప్రదంగా అభిమానిస్తోంది.

తీయగాసాగే ఈ జీవన సంగీత మాధురిలో అపస్వరాలు తాను వినలేడు!

తను చేసిన పనిని మనసు సమర్థిస్తూ వుంటే గుండెలనిండా గర్వం పేరుకొంది రాజారావుకు. ప్రపంచాన్ని జయించినంతటి ఉత్సాహం అతని మనసులో కదలాడింది. ఏదో తృప్తితో ఉషారుతో నడుస్తున్నాడు రాజా రావు! వీధిమలుపు తిరిగి ఇంటివైపు నడవబోయి క్షణంసేపు ఆగి పోయాడు. చీకట్లో మసగ్గా కన్పించిన ఆ దృశ్యం అతని ఆలోచనలకు ఆనకట్ట వేసింది. తన ఇంటితలుపులు తెరుచుకొని ఎవరో యువకుడు గాభ రాగా బయటికి వచ్చి ఇటూ అటూ చూసి రోడ్డు ఎక్కి వేగంగా నడిచి వెళ్ళిపోతున్నాడు. ఆ చీకట్లో అతనెవరో గుర్తుపట్టలేకపోయాడు. అతని మనసును ఏదో శంక పీడించింది.

మెల్లగా వెళ్ళి ఇంటి తలుపులు తోశాడు. తలుపులు తెరుచు కున్నాయి. సవ్వడి చేయకుండా వరండా దాటి వెళ్ళి గదిలో "స్విచ్" వేశాడు.

ఎదురుగా మంచంమీద కూర్చుని ఉంది విజయ!

మోకాళ్ళమీద తల పెట్టుకొని ముడుచుకొని కూర్చుని ఉంది.

ఆమె జుత్తు చెదిరిపోయి ఉంది. చీర అస్తవ్యస్తంగా ఉంది.

పక్కమీద నలిగి వత్తలైపోయిన గులాబీ రేకులు!

దీపం వెలగగానే తలఎత్తి రాజారావును చూసి స్థంభీభూతురాలయింది విజయ!

"మీరు సినిమాకు వెళ్ళలేదా?" మెల్లగా గొణిగింది. ఆమె మాటలు తడబడ్డాయి.

"ఏం తొందరగా వచ్చానని ఆశ్చర్యపోతున్నావా" రాజారావు అరిచేడు.

అతని కంఠంనిండా క్రౌర్యం ధ్వనించింది.

విజయ మాట్లాడలేదు.

"ఏం! మాట్లాడవేం?"

ఉప్పెనలా ముంచుకొస్తున్న దుఃఖాన్ని ఆపుకొనేయత్నం చేస్తోంది విజయ.

"వాడెవడు? మళ్ళీ కసిగా అడిగేడు.

"మా బావ...." మెల్లగా అంది. "ఇలావచ్చి కూర్చోండి. జరిగినదంతా చెప్తాను!"

"ఇక్కడే ఉంటాను. నువ్వు చెప్పదలచుకున్న కథ అర్జెంటుగా తయారుచేసి చెప్పు!"

విజయ అతనివైపు చూసింది.

"మా బావ రూర్కెలాలో పనిచేస్తున్నాడని చెప్పేదాన్ని కదా! మొన్ననే ఏదో పనిమీద మద్రాసు వెళ్ళేడట! తిరిగి వెళ్ళిపోతూ "కనెక్షన్" ట్రయిన్"కు కొంత ఆలస్యం వుంటే ఇక్కడకు వచ్చేడు! మీరు సినిమాకు వెళ్ళేరని చెప్పాను. పదకొండు గంటలకు రైలుందిట! వెళ్ళిపోయాడు!"

ఆమె గొంతు నూతిలోనుంచి వచ్చినట్లుంది.

ఆమె కనులనుండి నీళ్ళు ఉబికి వస్తున్నాయి.

వాడప్పుడే వెళ్ళిపోయాడని ఏడుస్తున్నావా? లేక నేను అప్పుడే వచ్చేసినందుకు ఏడుస్తున్నావా?"

కళ్ళు తుడుచుకొని రోషంగా భర్తవైపు చూసింది విజయ.

"రెంటికీకాదు! నా కర్మ ఇలా కాలినందుకు ఏడుస్తున్నాను. ఈ పరిస్థితిని రవంతయినా అర్థం చేసుకోకుండా మీరు మాట్లాడుతున్నందుకు ఏడుస్తున్నాను! ఏడవటంతప్ప ఇంకేం చేయలేని ఆడదాన్నికదూ! అందుకే ఏడుస్తున్నా!" ఆమె రెండు చేతులతో ముఖం కప్పేసుకుంది.

"మా ఇద్దరికీ మధ్య ఇప్పుడేం జరగలేదు—నమ్మండి! అంటావు. అంతేనా?" వ్యంగ్యంగా అన్నాడు.

"బావ స్వతహాగా మంచివాడు. అతన్ని ఏ పిశాచి ఆవహించిందో తెలీదు. బలవంతం చేయబోయాడు, అరిచి గోలచేస్తానని బెదిరిస్తే వెళ్ళిపోయాడు. అంతలోనే మీరూ వచ్చేరు. అంతే! అంతకంటే ఏమీ జరగలేదు! నా మాట నమ్మండి!"

"విజయా! మన జీవితాలు సినిమాలు కావు, నాటకాలంతకంటే కావు! ఏది ఏమైనా నీతో నాకిప్పుడు తర్కం అనవసరం! మనసారానిన్ను ప్రేమించాను. ఆ మనసు విరిగేలా దెబ్బతీశావు!"

రాజారావు ఈ మాటలు అనేసి గదిలోంచి బయటకు వచ్చేశాడు.

"అయితే నా మాటలు నమ్మరా?" విజయ అభ్యర్థన చెవుల్లో పడింది.

గబగబా అడుగులు వేసుకుంటూ రోడ్డుమీదకు వచ్చేశాడు. అతని గుండెల్లో అరణ్యాలు దహిస్తున్నట్లుంది!

నరాలన్నీ శరీరంలో తీవ్ర సంచలనం కలుగచేస్తున్నాయి.

తాను ప్రాణప్రదంగా ప్రేమించిన విజయ తనను మోసం చేసింది

సులోచనతో అనుభవాన్ని కాదని తాను బయటపడ్డాడు.

విజయకోసం తను, తనకోసం విజయ అనుకుంటూ గర్వపడ్డాడు. కాని తన గర్వం అంతా సూర్యునివేడిమికి కరిగిపోయిన మంచుముక్కలా అయిపోయింది. తన నమ్మకాలన్నీ వమ్ము అయ్యాయి! మనసంతా విజయ

మీది అసహ్యంతో నిండిపోయింది. విజయమీదే కాదు, సులోచన మీద కూడా అసహ్యం. లోకంమీద కూడా అసహ్యం! ఆఖరికి తనమీద తనకే అసహ్యం.

సందువదలి మెయిన్‌రోడ్ ఎక్కాడు. అనుకోకుండా కాళ్ళు "బార్" వైపుకు తీసుకు వెళ్ళాయి. "బార్" మెట్లెక్కి లోపలి హాల్లోకి వెళ్ళాడు. హాలు చాలావరకూ చీకటిగావుంది. హాలు మధ్యగా వేళాడుతున్న గాజు కుప్పెంలోంచి పల్చటి లేత నీలంరంగు వెలుగు పరుచుకుంటోంది. లోనికి వెళ్ళి ఒకవార సోఫాలో కూలబడి కళ్ళు మూసుకున్నాడు. ప్రక్కనున్న "ఎయిర్ కూలర్" లోంచి చల్లని గాలి ముఖానికి తాకుతోంది.

"ఆర్డర్ ప్లీజ్!" బేరర్ పిలుపుతో కళ్ళు విప్పి చూశాడు.

"ఒక "లార్జ్" "రమ్" తీసుకురా!"

బేరర్ రెండు నిమిషాల్లో "రమ్" గ్లాసు టేబులుమీద వుంచాడు. ఫ్లాస్కుతో ఐస్‌వాటర్, ప్లేట్లో "ఐస్ క్యూబ్స్" పక్కనే ఉంచాడు. చెంచాతో రెండుఐస్ ముక్కలు తీసి గ్లాసులో పడేసి రమ్ "సిప్" చేశాడు! గుటక దిగేసరికి గొంతు మండిపోయింది.

అంతకు ముందెప్పుడూ "రమ్" తాగలేదు రాజారావు. స్నేహితులతో కంపెనీకోసం "బీరు" త్రాగటం తప్ప ఇతనికి త్రాగటం పెద్దగా అలవాటు లేదు. గొంతుమీద రెండు వేళ్ళతో రాసుకున్నాడు. "రమ్" చాలా వెగటుగా అసహ్యంగా అనిపించింది.

ఎంతమండినా ఇలాగే త్రాగాలి! మనసు నిండా కసి! గ్లాసు అందుకొని గటగటా త్రాగేశాడు, పది నిమిషాల్లో మరో రెండు లార్జ్ "పెగ్స్" కష్టం లేకుండా రాజారావు గొంతులోకి జారిపోయాయి.

తల దిమ్ముగా అవుతోంది.

విజయ గుర్తుకు వచ్చింది. నిజంగా విజయ నిజమే చెప్తోందేమో! ఆమెను అనవసరంగా తాను హింసించేదేమో! ఎన్నడూ తమ ఇద్దరి

మధ్యా ఈ విధమైన గొడవలు రాలేదు. తాను ఈ విధంగా ఇల్లు వదలి వచ్చేసినందుకు విజయ ఏ ఆత్మహత్యకయినా తలపడితే!

ఈ విధమయిన భయం మనసులోకి రాగానే ఒడలంతా చెమటలు పట్టింది.

“బార్” లోంచి బయటపడి ఇంటికి నడిచేడు రాజారావు. తలుపులు తెరచుకొని బెడ్ రూమ్‌లోకి వెళ్ళాడు. అక్కడ విజయ కనబడలేదు. అతని నరనరాల్లో నిస్సత్తువ ఆవరించింది. వరండా దాటి గాభరాగా వంటింటివైపు నడిచాడు.

వంటగదిలోంచి మూలుగు వినిపిస్తోంది.

భయంతో రాజారావుకు అడుగులు ముందుకు పడలేదు.

ఒక్కసారి శక్తిని కూడగట్టుకొని తలుపులు తోశాడు. తెరచుకున్న తలుపులకు ఆవల దృశ్యం చూసి స్థాణువయిపోయాడు.

ఎదురుగా మంటలమధ్య విజయ! ప్రక్కనే ఖాళీగా పడిపోయి వున్న కిరసనాయిలు డబ్బా!

విజయ కిరసనాయిలు మీద పోసుకొని నిప్పంటించుకుంది.

“విజయా!” గట్టిగా అరిచేడు.

అతని చేతికి తగిలి టేబిలుమీది “రమ్” గ్లాసు ప్రక్కకుపడి ముక్కలయిపోయింది. కుర్రాడు ఎవరో వచ్చి పెంకులన్నీ ఏరి పక్కన పెడుతున్నాడు. “గురుడికి అప్పుడే కొట్టేసింది” దూరంగా కూర్చున్న ఎవరో అంటున్నారు. బేరర్! బిల్లు తీసుకురా!” మెల్లగా అన్నాడు రాజారావు.

రెండు నిమిషాల్లో బిల్లు తెచ్చాడు బేరర్! బిల్లు చెల్లించి ఇంటివైపు నడిచాడు రాజారావు. తడబడే అడుగులతో వెళ్ళి తలుపు తట్టాడు!

తలుపు తెరుచుకుంది!

ఎదురుగా విజయ! విజయను చూడగానే మళ్ళీ తనలోని మొగతనం, అహం బయటకు వచ్చేయి. ఏమయినా తను మెత్తబడకూడ

దన్నాడు! ఆమెను తాను క్షమించలేననుకున్నాడు. ఆమెవంక అసహ్యంగా చూసి బెడ్‌రూమ్‌లోకి వెళ్ళిపోయాడు. బట్టలుకూడామార్చుకోకుండామంచం మీద వాలిపోయాడు.

* * *

తనని ఎవరో బలంగా కుదిపి లేపుతూ వుంటే తెలివి వచ్చింది రాజారావుకి! తలమీద ఎవరో సమ్మెటలతో మోదుతున్నట్లు భారంగా ఉంది. కనురెప్పలు బరువుగా విడిపడ్డాయి.! అప్పుడేబాగా తెల్లారిపోయింది ఎదురుగా విజయ నిలబడివుంది.

చికాకుగా ఆమెవంక చూశాడు—ఆమె ముఖం నిండా ఆందోళన! ఆమె పెదాలు భయంతో అదురుతున్నాయి. ఏదో పిశాచాన్ని చూసి జడుసుకున్న దానికి మల్లే వుంది విజయ!

"ఏమండీ! సారధిగారి భార్య చచ్చిపోయింది!" అంది వణకే స్వరంతో. రాజారావుకి షాక్ తిన్నట్లు అయింది.

మత్తు అంతా ఒకసారి దిగజారిపోయింది!

"ఏమిటి?" అంటూ నమ్మలేనట్లుగా విజయ వంక చూస్తూ మంచం మీద నుంచి లేచాడు.

"మిల్క్-బూత్"కు వెళ్ళొస్తూ పలుకరిద్దామని సులోచన ఇంట్లోకి వెళ్ళాను. ఆమె బెడ్‌రూమ్‌లో మంచంమీద పడివుంది. పక్కనే నిద్ర మాత్రల సీసా ఖాళీగావుంది. భయంతో వాళ్ళ పక్కింటి ప్లీడరుగారికి చెప్పాను. ఆయన వచ్చి చూశాడు అప్పటికే ప్రాణం పోయింది. వెంటనే అక్కడనుండి వచ్చేశాను."

విజయ ఆయాసంతో రొప్పుతుంది.

రాజారావు త్వరితంగా అడుగులు వేసుకుంటూ సులోచన ఇంటి వైపు నడిచేడు. అప్పుడే ఇంటిముందు జనం పోగయ్యారు. మెల్లగాలోనికి వెళ్ళాడు. సులోచన మంచంమీద పడివుంది. ప్రక్కనే మోకాళ్ళలో తల దూర్చి కూర్చున్నాడు సారధి. అప్పుడప్పుడు తలఎత్తి పిచ్చిపట్టినవాడిలా

సులోచన వంక చూస్తున్నాడు అతను। రాజారావును చూడగానే అతని దుఃఖం కట్టలు తెంచుకుంది.

"కేంపుకెళ్ళి ఇప్పుడే వచ్చాను. నేనుంటే ఇంత ఘోరం జరిగి ఉండేదికాదు" అన్నాడు ఏడుపు మధ్యలో. రాజారావుకి ఏం మాట్లాడాలో తోచలేదు.

రాజారావుకి మతిపోతున్నట్లుంది!

అతని మనసు స్వాధీనం తప్పుతోంది.

సులోచనవైపు చూడలేకపోయాడు. ఆ గదిలో నిలబడలేక పోయాడు. బయటికి వచ్చి వరండాలో ఒక వారగా స్థంభానికి జేరగిలబడి పోయాడు. కనులు తెరిచినా మూసినా సులోచన రూపమే కనులముందు నర్తిస్తోంది।

ఆమె కనులు నవ్వుతున్నాయి!

అమె తడిపెదాలు సుతారంగా కదులుతున్నాయి।

ఆమె కళ్ళు కోపంతో జేవురించాయి।

ఆమె పెదాలు పగబట్టి అదురుతున్నాయి।

రాజారావు కనులముందు సినిమారీలులోని బొమ్మలకుమల్లే సులోచన రూపం కదులుతోంది.

సులోచన చచ్చిపోయింది! అది మామూలు చావుకాదు.

ఆత్మహత్య? కసితో చచ్చిపోయింది. కోపంతో చచ్చిపోయింది.

లేకపోతే నిండుప్రాణం ఎందుకు తీసుకుంటుంది? !

తనమీద కసి! తనమీదే కోపం!

ఆమె వికటాట్టహాసం చేస్తూ రెండుచేతులూ తన మెడచుట్టూ బిగించి నొక్కేస్తున్నట్లనిపించింది.

"క్రితంరాత్రి ఆమెయెడల తాను నిర్దయగా ప్రవర్తించకుండా ఉండివుంటే!" ఏమో పరిస్థితులు ఎలా వుండేవో అనుకున్నాడు రాజారావు.

ఇటు సులోచన ఆత్మహత్య చేసుకొంది.

అటు విజయ తనకు తీరని ద్రోహం చేసింది.

మెల్లగా సారధి దగ్గరికివెళ్ళి ఓదార్చాలనుకున్నాడు. కాని అందుకు భయం వేసింది. సులోచన ఆత్మహత్యకు తానే కారణం అని సారధికి తెలిస్తే ఇంకేమైనా వుందా? ఈ ఆలోచన రాగానే భయంతో వణికి పోయాడు.

మెల్లగా కాళ్ళీడ్చుకుంటూ గది గుమ్మం దగ్గరకు వెళ్ళాడు.

"ఇంత ఘోరం ఎలా జరిగింది సారధీ?" మెల్లగా సారధి భుజాల మీద అనునయంగా రాస్తూ అన్నాడు.

"ఏమీ తేలడంలేదు. నిన్న సాయంకాలం విజయనగరం వెళుతూ వుంటే నవ్వుతూ నన్ను సాగనంపింది. కనీసం ఒక్కమాటయినా చెప్ప కుండా వెళ్ళిపోయింది. తన చావుకి కారణం తనతోనే పట్టుకువెళ్ళి పోయింది" అంటూ చిన్న పిల్లాడికి మల్లే బావురుమన్నాడు సారధి.

సారధిని ఓదార్చటం తనవశం కాకపోయింది.

భారంగా అడుగులు వేసుకుంటూ ఇంటికి వచ్చేశాడు రాజారావు. చొక్కా విప్పుకుంటూ వుంటే "కాఫీ తీసుకోండి!" అంటూ విజయ కాఫీ కప్పుతో వచ్చింది. "నాకు నీమొహం చూపించకు" అన్నాడు రాజారావు.

విజయ విరక్తిగా నవ్వింది!

"ఒకే ఇంట్లో వుంటూ అదెలా సాధ్యం?....అయినా అంతకోపం దేనికి?"

"ఏం? ఇంకా అర్థం కాలేదా?" నీతో నేనేం చెప్పదల్చుకోలేదు.

"నిన్నరాత్రి విషయంలో మీ అనుమానం పోలేదన్నమాట!" అంది విజయ.

"పోలేదు!—పోదు!" విసురుగా తువ్వాలు అందుకొని బాత్ రూమ్వైపు నడిచాడు రాజారావు. క్షణంసేపు దారిలో ఆగి అన్నాడు.

"నీకు నాకూ ఏ సంబంధంలేదు. మర్యాదగా నువ్వు మీ ఊరెళ్ళిపో! మీ వాళ్ళకు ఈ విషయం నేను రాసేలోగా నువ్వెళ్ళిపోవటం మంచిది!"

"ఏమని రాస్తారు?" రోషంగా అడిగింది.

"ఛీ! సిగ్గులేదూ!" రాజారావు విసురుగా బాత్‌రూంలోకి వెళ్ళిపోయాడు.

స్నానం ముగించి వచ్చి గదిలో సోఫాలో కూలబడ్డాడు. మనసంతా చికాకుగావుంది. తుదిమొదలు లేని ఆలోచనలు మనసు నిండా ముసిరి కుడుతున్నాయి- తేనెటీగలకు మల్లే!

ఒకవంక సులోచన మరణం తనను క్రుంగదీస్తోంది!

ఇంకోవంక విజయ ప్రవర్తన మనసును తొలిచేస్తోంది!

"ఏమండీ?" విజయ మృదువుగా పిలిచింది.

"ఏం?" కనులు ఎత్తి ఆమెవంక చూశాడు. ఇంతకుముందు తాను చూసిన బెదురు ఇప్పుడు ఆమె ముఖంలో లేదు దాని స్థానంలో నిశ్చలత.

"నేను వెళ్ళిపోవాలా?" నిర్లిప్తంగా అడిగింది.

"ఏం బెదిరిస్తున్నావా? వెళ్ళిపొమ్మనే చెప్తున్నాను!"

విజయ పేలవంగా నవ్వింది.

"బెదిరించడానికి నేనెవర్ని? ఆడదాన్ని! శారీరకంగా అబలలం! మానసికంగా ఆధారంకూడా మీ తెలివితేటలే! మీరే మమ్మల్ని నడిపిస్తున్నారు. మీరే మమ్మల్ని బతికిస్తున్నారు. మీరు శాసిస్తే మేం వినాలి! ఇది తరతరాలుగా వస్తున్న సాంప్రదాయమే కదండీ! నేను ఎలా బెదిరించగలను?

మీకు కష్టంగా వుంటుందంటే కొంతకాలం మీకు దూరంగా వుంటాను. ఎడమొహం పెడమొహంతో గడపటం నాకూ కష్టమే!" మాట్లాడటం ఆపి దీర్ఘంగా ఊపిరి పీల్చుకుంది.

"మొగాడు అన్యాయంగా అత్యాచారానికి పూనుకుంటే ఆ తప్పు అంతా ఆడదానిదే అవుతుందన్నమాట! అంతేనా?" సూటిగా అడిగింది.

"ముల్లు, అరిటాకు సామెత వినలేదా!" వ్యంగ్యంగా అన్నాడు రాజారావు.

"ఎందుకు వినలేదూ! ఆ సామెతల్ని విని నరనరాల్లో జీర్ణించుకొని మనం ఈ స్థితికి దిగజారాం. ఈ దేశంలో మొగాడికో రూలు; ఆడదానికో రూలు! మొగాడు వీధినపడి ఎన్నితిరుగుళ్ళయినా తిరగొచ్చు! ఆడది వీధిశంక కన్నెత్తిచూస్తే తప్పు. మొగాడు తిరక్క చెడిపోతాడు! ఆడది తిరిగితే చెడిపోతుంది. ఇవన్నీ మన పూర్వులు మన కందించిన వేదాలు! మొగాడు ఆడదానితో తిరిగితే వాడు రసికుడు. అదే మొగాడి కామదాహానికి బలి అయిన స్త్రీ వ్యభిచారిణి.

కట్టుకున్న భర్త కట్టు కథల్నీ భార్య నమ్మాలి.
అదే! భార్య నిజంచెప్పినా భర్త నమ్మడు.

రవంత అనుమానం తల ఎత్తితే మధ్యనున్న ప్రేమలు, అభిమానాలు ఇట్టే కరిగిపోతాయి" విజయ ఆవేశంతో అంది.

"ఆపు నీ ప్రసంగం!" గట్టిగా అరిచేడు రాజారావు.
విజయ నీరసంగా తలుపుకి జేరగిలబడి నిలబడింది.

"మొగాళ్ళందరూ నువ్వనుకునేటంత నీచులు కారు...." క్షణం సేపు ఆగి మళ్ళీ అన్నాడు రాజారావు.

"విజయా ! నేను నిన్నెంతగా ప్రేమిస్తున్నానో నీకు తెలియదు. అందుకే ఇంత బాధపడుతున్నాను నమ్ముకున్న మనిషినిలువునా దగాచేస్తే ద్వేషం కాక ఏం మిగులుతుంది? ..." విజయ అతని మాటలు వింటూ రెప్ప వాల్చకుండా అతని వంకే చూస్తోంది...." నిన్నరాత్రి ఏం జరిగిందో నీకు తెలుసా? సినిమాకి సారధితో కలిసి వెళదామని వాళ్ళ ఇంటికి వెళ్ళాను. సారధి ఊళ్ళోలేడు. సులోచన మాటలలో పెట్టి నన్ను రెచ్చగొట్టింది. నన్ను నిలువెల్లా కవ్వించింది! నీ మీది ప్రేమతో సారధికి ద్రోహం చేయలేని తలంపుతో సులోచనను తిరస్కరించి బయట పడ్డాను. ఆమె ఆత్మహత్యకు పరోక్షంగా నేను కొంత కారణమేమోనని మనసు బాధపడు

తోంది. నాకోసం నువ్వు. నీకోసం నేను అనే గర్వం మనసునిండా నింపు కుని ఇంటికివస్తే నాకు ఎదురుదెబ్బ తగిలింది.

నాకీ పరిస్థితిలో పిచ్చెత్తేటట్లుంది విజయా...." అంటూ చేతులతో తలను పట్టుకున్నాడు.

"నీ మీది ప్రేమతో సులోచన చావుకు కూడా కారణం నేనే అయ్యాను."

ఇద్దరిమధ్యా రెండుక్షణాలు భయంకర నిశ్శబ్దం చోటుచేసుకుంది.

"అయితే మీరు సులోచనను నిరాకరించి వచ్చానంటారు" విజయ సూటిగా అంది.

"నిన్నరాత్రి మీరు—సులోచనను—అనుభవించారు."

"విజయా!" అరిచాడు రాజారావు.

"కాదని ఎలా నమ్మను చెప్పండి" తాపీగా అడిగింది విజయ.

"నేను చెప్తున్నాను కదా!"

"నేను చెప్పేది మీరు నమ్మరు. కాని మీరు చెప్పేది నేననమ్మాలి! రాజారావు తేలిగ్గా నవ్వాడు.

"విజయా! నేను నీకీ విషయం చెప్పివుండకపోతే అసలు నీకు తెలిసివుండేది కాదు. అవునా?"

విజయ విరక్తిగా అతనివైపు చూసింది.

"మీరు నిన్నరాత్రి మరోగంట ఆలస్యంగా వచ్చివుంటే — నా విషయం మటుకు మీకు తెలిసేదా?—అయినా నేనుమాత్రం మీనుండి దాచాలనుకోలేదు, చెప్పాలనే అనుకున్నాను. విషయం మీనుండి దాచాలను కుంటే ఏమీజరగనట్టే ప్రవర్తించి వుండేదాన్ని. మీరు నన్ను నమ్ముతారనే అనుకున్నా. కాని ఇలా ఊహిస్తారనుకోలేదు!" దీర్ఘంగా నిట్టూర్పు వదలి మళ్ళీ అంది విజయ.

"నా విషయంలో నేను ఏనాటికీ నిజంఋజువు చేసుకోలేను. కనుక

మీరు నన్ను అనుమానించటం మానరు! మీ విషయంలో .... సులోచన చచ్చిపోయింది. కనుక మీరు ఏం చెప్పినా నేను నమ్మాలి!"

రాజారావు కుర్చీలోంచి లేచి నిలబడ్డాడు.

"ఏం? నేను చెప్పిన సంగతి ఆధారంగా నామీద అపవాదు వేద్దామనుకుంటున్నావా?"

విజయ విచిత్రంగా నవ్వింది.

"మీమాటల్ని పట్టుకుని నేనేం "బ్లాక్ మెయిల్" చెయ్యాలనుకోవటంలేదు. అంత నీచురాల్నికాదు నేను! అయితే ఈ విషయం మీరు చెప్పనంతలో నాకు తెలీదని అనుకోకండి! మీరు సులోచనను బలవంతంగా అనుభవించేను. ఆ అవమానం భరించలేక సులోచన చచ్చిపోయింది!"

రాజారావు "ఇక ఆపు" అంటూ గర్జించాడు.

మరుక్షణంలో విజయ చెంపపగిలేలా కొట్టాడు. విజయ ఏడుస్తూ "ఈ ఉత్తరం చదవండి! ఉదయం సులోచన ఇంటికివెళ్తే ఆమె తల దగ్గర దొరికింది. చదివి వెంటనే దాన్ని తీసుకొచ్చేశాను. అదే ఇంకెవరి చేతుల్లోనయినా పడివుంటే పరిస్థితులు ఎలా వుండేవో ఆలోచించండి!" అంటూ జాకెట్‌లోంచి తీసి ఒక ఉత్తరం అందించింది.

వణుకుతున్న చేతులతో కాగితం మడత విప్పేడు రాజారావు.

కళ్ళు బైర్లుకమ్మి అక్షరాలు సరిగా కనబడటంలేదు.

ఉత్తరంలో ఉన్నవి మూడే వాక్యాలు.

"మిత్రుడనుకున్న రాజారావు శత్రువయ్యాడు. శీలంపోయాక బ్రతుకెందుకు? అదే నా చావుకి కారణం!—సులోచన."

రాజారావుకు భూమి తనచుట్టూ గిరగిరా తిరుగుతున్నట్లనిపించింది.

(1977 జ్యోతి దీపావళి ప్రత్యేక సంచిక)